సాక్షి
పశ్చిమగోదావరి

బుధవారం । 8 । జనవరి । 2025



ఆక్వా సాగుపై అవగాహన

ఏలూరు(మెట్రో): ఆక్వాలో యాంటీ బయోటిక్స్ వాడకుండా తనిఖీలు నిర్వహించి, అవగాహన కల్పించాలని అధికారులకు జాయింట్ కలెక్టర్ ధాత్రిరెడ్డి సూచించారు.



క్షేత్ర వీధుల్లో ఊరేగిన శ్రీవారు

ద్వారకాతిరుమల: ధనుర్మాస ఉత్సవాల్లో భాగంగా మంగళవారం ఉదయం శ్రీవారు ఉభయ దేవేరులతో కలిసి, తొళక్క వాహనంపై క్షేత్ర వీధుల్లో ఊరేగారు.



వైభవంగా సింహాసన ఉత్సవం

జంగారెడ్డిగూడెం: పారిజాత గిరి వేంకటేశ్వర టేశ్వర స్వామి దేవస్థానంలో మంగళవారం గోదా రంగనాథ ఉత్సవ మూర్తులకు సింహాసన ఉత్సవాన్ని వైభవంగా నిర్వహించారు.


బరులకు బేరం

సంక్రాంతి కోడిపందేలకు పశ్చిమగోదావరి జిల్లా పెట్టింది పేరు. భీమవరం, చుట్టుపక్కల జరిగే పందేలకు ఉండే క్రేజ్ అంతా ఇంతా కాదు. చుట్టూ గ్యాలరీలు, ఎల్ఈడీ స్క్రీన్ల మధ్య జరిగే పందేలను వీక్షించేందుకు రాష్ట్రం నలుమూలల నుంచే కాదు.. దేశ విదేశాల నుంచి బంధుమిత్రులు వస్తుంటారు. మూడు రోజుల్లో రూ.వంద కోట్లకు పైగా నగదు చేతులు మారుతుందని అంచనా. ఇప్పటికే బరుల ఏర్పాట్లలో నిర్వాహకులు నిమగ్నమయ్యారు. ప్రాంతం, బరి సైజును బట్టి రూ.15 లక్షల నుంచి రూ.కోటి వరకూ డిమాండ్ చేస్తున్నారు.

- భీమవరం పరిసరాల్లో రూ.కోటి..
- ఇతర చోట్ల రూ.15 లక్షల నుంచి రూ.60 లక్షల వరకు రేటు
- కోడిపందేల బరుల వద్దే గుండాట, పేకాటకు ఏర్పాట్లు
- నియంత్రణ ఊసెత్తని పోలీసులు



పశ్చిమగోదావరి జిల్లాలో సిద్ధమవుతున్న కోడిపందేల బరులు



సాక్షి, భీమవరం : భీమవరం చుట్టుపక్కల సీసలి, పెద అమిరం, కొవ్వాడ అన్నవరం, డేగాపురంలో నాలుగు భారీ బరులను సిద్ధం చేస్తున్నారు. ఒక్కో బరి దాదాపు రెండెకరాల్లో ఉండేలా ప్లాన్ చేస్తున్నారు. కోడిపందేల కోసం మధ్యలో పెద్ద దిమ్మ, చుట్టూ ప్రేక్షకులు కూర్చుని చూసేందుకు వీలుగా గ్యాలరీలు నిర్మిస్తున్నారు. పక్కనే భారీగా గుండాట, పేకాట ఇతర జూద కార్యకలాపాలకు ఏర్పాట్లు చేస్తున్నారు. జిల్లాలోని కలగంపూడి, వీరవాసరం, తణుకు, తాడేపల్లిగూడెం, కొణితివాడ, ఆచంట, కొత్తపాడు, కవిటం, వడలి, అయినపర్రు, గణపవరం, తదితర చోట్ల బరుల ఏర్పాట్లలో ఉన్నారు. చాలాచోట్ల టీడీపీ, జనసేన నాయకులు సిండికేటుగా, కొన్నిచోట్ల వేర్వేరుగా బరులను సిద్ధం చేయిస్తున్నట్టు తెలుస్తోంది.

భీమవరం ప్రాంతంలో రూ.80 లక్షల నుంచి రూ.కోటి..

కేవలం కోడిపందేల ద్వారా బరులు నడిపితే నిర్వాహకులకు అంతగా వచ్చేది ఏమీ లేక నష్టపోవాల్సివస్తుంది. పెద్ద బరిలో రోజుకు 15 నుంచి 20 వరకు మాత్రమే పందేలు జరుగుతాయి. ఒక పందెం నిర్వహించేందుకు రూ.10 వేల నుంచి రూ.25 వేల వరకు వసూలు చేస్తే మూడు రోజుల్లో వచ్చే మొత్తం రూ.5.5 లక్షలు నుంచి రూ.15 లక్షలు లోపే ఉంటుంది. బరి నిర్మాణం నిమిత్తం రూ. ఎనిమిది లక్షలు నుంచి రూ.12 లక్షల వరకు ఖర్చయితే, నేతలు, పోలీసులు, రెవెన్యూ, పంచాయతీ, ఫైర్ అధికారులకు మామూళ్లు, వారికి పంపే కోజాల (పందెం పుంజులు) ఖర్చు, బౌన్సర్లు, సిబ్బంది జీతాలు తదితర రూపాల్లో బరిని బట్టి రూ.10 లక్షల నుంచి రూ.50 లక్షలు పైనే ఉంటుందని అంచనా. బరుల వద్ద గుండాట, పేకాట, ఇతర జూదాలు, అశ్లీల నృత్యాలు, మద్యం స్టాళ్లు, చికెన్ పకోడీ, ఫాస్ట్ ఫుడ్ సెంటర్లు పెట్టించడం ద్వారా ఈ ఖర్చును, తమ లాభాలను రాబడతారు. భీమవరం పరిసరాల్లోని బరులకు రూ.80 లక్షల నుంచి రూ.కోటి వరకు, మిగిలిన ప్రాంతాల్లో జనాల రద్దీని బట్టి రూ.15 లక్షల నుంచి రూ.60 లక్షల వరకు బేరసారాలు సాగిస్తున్నట్టు సమాచారం. కొన్నిచోట్ల ఇప్పటికే జూద నిర్వాహకులు బరులను దక్కించుకుని అందుకు అవసరమైన ఏర్పాట్లు చేస్తున్నారు.

జేబులు గుల్లే

ప్రత్యేకంగా బరుల వద్ద జూదాల నిర్వహణలో ఆరితేరిన వారు ఎంతో మంది ఉన్నారు. పందేలు చూసేందుకు వచ్చిన వారిని ఆకర్షించి వారి జేబులు గుల్ల చేసి ఒట్టి చేతులతో పంపిస్తుంటారు. ప్రస్తుతం జిల్లా వ్యాప్తంగా బరులను దక్కించుకునే పనిలో వీరంతా నిమగ్నమై ఉన్నారు. బరులను సిద్ధం చేయిస్తున్న వారితో బేరసారాలు సాగిస్తున్నారు.



పందేల ఊసెత్తని పోలీసులు

కోడి పందేలు నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరిస్తూ సంక్రాంతికి రెండు మూడు వారాల ముందు నుంచే గ్రామగ్రామాన విస్తృత ప్రచారం చేసేవారు. సిద్ధం చేస్తున్న బరులను ధ్వంసం చేసి పందేలు నిర్వహించరాదని బ్యానర్లు కట్టించేవారు. డిసెంబరు నెలలోనే కోడి కత్తుల తయారీదారులు, కట్టే వారు, పందేలు, గుండాట, పేకాట నిర్వాహకులను బైండోవర్ చేస్తుండేవారు. గత ఏడాది జిల్లాలో దాదాపు 700 మందికి పైగా బైండోవర్ చేసి 1500కు పైగా కోడికత్తులు స్వాధీనం చేసుకున్నారు. ఈ సారి మాత్రం జిల్లాలో ఎక్కడా ఆ దిశగా చర్యలు తీసుకున్న దాఖలాలు లేవు. సంక్రాంతికి రెండు నెలల ముందు నుంచే వారంలో రెండు మూడు చోట్ల రాత్రి వేళల్లో ప్రజాప్రతినిధుల ఆధ్వర్యంలో కోడిపందేలు ఏర్పాటు చేస్తున్నా పోలీసులు పట్టించుకోవడం లేదన్న ఆరోపణలు ఉన్నాయి. కోడిపందేల సంప్రదాయం మాటున జూద కార్యకలాపాలతో ఎన్నో కుటుంబాలు చిన్నాభిన్నమవుతున్నా పోలీసు యంత్రాంగం పట్టించుకోకపోవడం విమర్శలకు తావిస్తోంది.



గతేడాది కాళ్ల మండలం సీసలిలో ఏర్పాటు చేసిన కోడిపందేల బరి(ఫైల్)

న్యూస్‌రీల్

ఆర్టీసీ బస్సులపై డీఎం పర్యవేక్షణ



తణుకు ఆర్టీసీ డిపో గ్యారేజీలో మరమ్మతులు పరిశీలిస్తున్న మేనేజరు గిరిధర్ కుమార్

సాక్షి స్పందన

తణుకు అర్బన్: 'తణుకు ఆర్టీసీ బస్సుల్లో సమస్యల హారన్' శీర్షికన సాక్షి పత్రికలో మంగళవారం ప్రచురితమైన కథనానికి డిపో మేనేజరు సప్పా గిరిధర్ కుమార్ స్పందించారు. డిపో గ్యారేజీలో బస్సులకు నిర్వహిస్తున్న మరమ్మతు లను ఆయన ప్రత్యేకంగా పర్యవేక్షించారు. ఎలాంటి చిన్న ఇబ్బంది ఉన్నా వెంటనే పరిష్కరించిన తరువాతే బస్సును బయటకు పంపించాలని గ్యారేజీ సిబ్బందికి సూచించారు. ఈ సందర్భంగా బస్సుల బాడీ మరమ్మతులు, పెయింటింగ్, వెల్డింగ్, ఎలక్ట్రికల్ పనులపై ఆరా తీశారు.

శ్రీవారి హుండీ ఆదాయం రూ.3.85 కోట్లు



హుండీల నగదు లెక్కిస్తున్న ఆలయ సిబ్బంది

ద్వారకాతిరుమల: ప్రముఖ పుణ్యక్షేత్రమైన ద్వారకాతిరుమల చినవెంకన్న ఆలయ హుండీల నగదు లెక్కింపు స్థానిక ప్రమోద కల్యాణ మండపంలో మంగళవారం కట్టుదిట్టమైన భద్రత నడుమ జరిగింది. ఈ లెక్కింపులో శ్రీవారికి విశేష ఆదాయం సమకూరింది. గత 40 రోజులకు నగదు రూపేణా స్వామికి రూ.3,85,61,549 ఆదాయంతో పాటు, కానుకల రూపేణా భక్తులు సమర్పించిన 383 గ్రాముల బంగారం, 12.008 కేజీల వెండి, అధికంగా విదేశీ కరెన్సీ లభించినట్టు ఆలయ ఇన్‌చార్జి ఈఓ. వేంద్ర త్రినాథరావు తెలిపారు. లెక్కింపులోకి రాని రద్దయిన పాత రూ.500, రూ.1,000, రూ.2,000 నోట్ల ద్వారా రూ.29,500 లభించినట్టు చెప్పారు.

మూగ జీవాల సంరక్షణకు కృషిచేయాలి



కోడి పందేల నిషేధంపై గోడ పత్రిక ఆవిష్కరణ

భీమవరం(ప్రకాశం చౌక్): పశువుల సంరక్షణకు అందరూ సమష్టిగా కృషి చేయాలని కలెక్టర్ చదలవాడ నాగరాణి అన్నారు. మంగళవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన జిల్లా జంతు సంక్షేమ సంఘం సర్వసభ్య సమావేశంలో మాట్లాడారు. జంతువులు పట్ల దయ, కరుణ కలిగి ఉండాలన్నారు. కోడి పందేల్ని అరికట్టేందుకు గ్రామాలు, మండలాలు, డివిజన్ స్థాయిలో, సంయుక్త తనిఖీ బృందాలను ఏర్పాటు చేశామన్నారు. అడిషనల్ ఎస్పీ వి.భీమారావు మాట్లాడుతూ కోడి పందేలు, బరులు నిర్వహించకుండా ముందస్తు చర్యలు చేపట్టామన్నారు. కోడి పందేల నిషేధంపై గోడ పత్రికను కలెక్టర్ చేతుల మీదుగా ఆవిష్కరించారు. కార్యక్రమంలో డీఆర్ఓ మొగలి వెంకటేశ్వర్లు, అదనపు ఎస్పీ వి.భీమారావు, పశు సంవర్ధక శాఖ అధికారి డా.కె.మురళీకృష్ణ పాల్గొన్నారు.

12 వరకు అభ్యంతరాల స్వీకరణ

భీమవరం(ప్రకాశం చౌక్) ఎస్సీ కులగణనపై అభ్యంతరాల స్వీకరణ గడువును జనవరి 12 వరకు పొడిగించినట్లు కలెక్టర్ చదలవాడ నాగరాణి తెలిపారు. జనవరి 7తో గడువు ముగిసినప్పటికీ మరోసారి పొడించారన్నారు. సంబంధిత అధికారులు ప్రజల నుంచి అభ్యంతరాలు స్వీకరిస్తారన్నారు. కులగణన సర్వే వివరాలను జనవరి 20న గ్రామ, వార్డు సచివాలయాల వద్ద విడుదల చేస్తారని వెల్లడించారు.

పెన్షన్లు మంజూరు చేయాలి

ఏలూరు (టూటౌన్): అర్హులైన డప్పు కళాకారులు, చెప్పులు కుట్టే చర్మకారులకు, లెదర్ వర్క్ కార్మికులకు పెన్షన్లు మంజూరు చేయాలని దళిత సేన ముఖ్యమంత్రికి విజ్ఞప్తి చేసింది. ఆర్ఆర్‌పేటలోని దళిత సేన జిల్లా కార్యాలయంలో మంగళవారం సాయంత్రం ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు.

మహిళల కోసం వినూత్న ప్రాజెక్టులు చేపట్టాలి

భీమవరం(ప్రకాశం చౌక్): జిల్లాలోని వివిధ వర్గాల మహిళల మెరుగైన జీవనోపాధికి వినూత్న ప్రాజెక్టులు అమలు చేయాలని కలెక్టర్ చదలవాడ నాగరాణి సూచించారు. కలెక్టరేట్‌లో మహిళల ఉపాధికి అవసరమైన ప్రాజెక్టులపై గ్రామీణ్ ఫౌండేషన్ ప్రతినిధులతో ఆమె సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని విభిన్న వర్గాల మహిళలను వ్యాపారవేత్తలుగా తీర్చిదిద్దేందుకు కొత్త ప్రాజెక్టులు అమలు చేయడంతో పాటు, అవసరమైన శిక్షణ అందించాలని సూచించారు. వర్మీ కంపోస్ట్ ఎగుమతులకు అవసరమైన సాయాన్ని అందించడం, డ్రోన్ల నిర్వహణపై శిక్షణ తదితర ప్రాజెక్టుల రూపకల్పనకు ఆలోచన చేసి అమలుకు సిద్ధం చేయాలన్నారు. జిల్లాలో డంపింగ్ యార్డ్ సమస్య తీవ్రంగా ఉందని చెత్తను వర్మీ కంపోస్ట్‌గా మార్చి జపాన్ వంటి దేశాల్లో అమలు చేస్తున్న విధానాలకు అనుగుణంగా ఎగుమతులకు ప్రోత్సాహం అందించాలన్నారు. గ్రామీణ ఫౌండేషన్ సీనియర్ ప్రోగ్రాం డైరెక్టర్ అరిందం దాస్ గుప్తా మాట్లాడుతూ తూర్పు, పశ్చిమ, కృష్ణ, విశాఖపట్నం జిల్లాలలో సీఎస్ఆర్ ఫండ్స్‌తో గ్రోద్రెజ్ ప్రాజెక్టు చేపట్టామన్నారు. మూడు నెలల కాలవ్యవధిలో 5 వేల మంది మహిళా రైతులను వ్యాపారవేత్తలుగా తీర్చిదిద్దగా మరో 10 లక్షల మంది చిన్న, సన్న కారు రైతులకు సహాయం చేసేలా ప్రోత్సహించామన్నారు. పశ్చిమ గోదావరిలోని యానాది, ఎరుకల జీవనోపాధి మెరుగుదల కోసం ముసాయిదా ప్రతిపాదనను తయారు చేసి కలెక్టర్‌కు వివరించారు. గోద్రెజ్ ప్రాజెక్ట్ కోసం 10 మండలాలు ఎంపిక చేశామని, మూడు నెలల పైలట్ ప్రాజెక్టుగా జనవరి 15 నుంచి చేపడతామన్నారు.



గ్రామీణ్ ఫౌండేషన్ ప్రతినిధులతో మాట్లాడుతున్న కలెక్టర్ నాగరాణి

హైవే పనులు ప్రారంభించనున్న ప్రధాని

బుట్టాయగూడెం: పశ్చిమ ఏజెన్సీప్రాంతంలో నూతనంగా మంజూరైన జాతీయ రహదారి 365 బీబీ నిర్మాణం పనులను నేడు ప్రధానమంత్రి మోదీ వర్చువల్‌గా ప్రారంభించనున్నారు. దీనికి సంబంధించి ఎన్‌హెచ్ అధికారులు జీలుగుమిల్లిలో శిలాఫలకం దిమ్మను మంగళవారం రాత్రి ఏర్పాటు చేశారు. విశాఖపట్నం పర్యటనకు వస్తున్న ప్రధాన మంత్రి మోదీ రాష్ట్రంలో నిర్మించిన జాతీయ రహదారులను ప్రారంభించడంతో, శంకుస్థాపనలు చేయనున్నట్లు అధికారులు తెలిపారు. ఏజెన్సీ ప్రాంతంలో మంజూరైన జాతీయ రహదారి 365 బీబీ రోడ్డు పనులకు కూడా శంకుస్థాపన చేస్తారని అధికారులు తెలిపారు. ఈ రహదారి జీలుగుమిల్లి మండలం తాటాకులగూడెం నుంచి జీలుగుమిల్లి, బుట్టాయగూడెం మీదుగా రెడ్డి గణపవరం, కేఆర్‌పురం, పోలవరం మండలం ఎల్ఎన్‌డిపేట మీదుగా పట్టిసీమ వరకూ సుమారు 40.4 కిలోమీటర్లు ఉంటుంది. పట్టిసీమ నుంచి రాజమండ్రి వరకూ కూడా ఈ రహదారి పనులు జరగనున్నాయి. జాతీయ రహదారి విస్తరణకు సంబంధించి అవసరమైన భూసేకరణకు అధికారులు ఇప్పటికే గ్రామసభలు నిర్వహించారు.



జీలుగుమిల్లిలో శిలాఫలకం దిమ్మను ఏర్పాటు చేసిన అధికారులు

అప్పుల బాధతో రైతు ఆత్మహత్య

పెదవేగి: అప్పుల బాధ తాళలేక ఓ రైతు ఆత్మహత్య చేసుకున్నారు. పెదవేగి ఎస్సై కె.రామకృష్ణ తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని జగన్నాథపురం గ్రామానికి చెందిన చిలకలపూడి చెన్నకేశవరావు(55) ఈ నెల 5న అర్ధరాత్రి సమయంలో ఆత్మహత్యకు పాల్పడ్డాడు. వ్యవసాయం కోసం చేసిన అప్పుల బాధ భరించలేక పురుగుల మందు తాగాడు. వాంతులు చేసుకుంటుండగా భార్య చూసి కుటుంబసభ్యుల సాయంతో ఏలూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించింది. అక్కడ చికిత్స పొందుతూ ఈనెల 6న చెన్నకేశవరావు మృతిచెందాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

● మాస్క్.. మళ్లీ మొదలు



కరోనా మహమ్మారి బెడద తొలగి రెండేళ్లు దాటిపోయింది. ఇప్పుడు మరో వైరస్ భయపెడుతోంది. హెచ్ఎంపీవీ వైరస్ కేసులు దేశంలో వెలుగు చూడదంతో ప్రజలు అప్రమత్తమయ్యారు. ముందు జాగ్రత్తగా మాస్క్‌లు ధరించి రోడ్లపైకి వస్తున్నారు. చిన్న, పెద్ద అనే తేడా లేకుండా అందరూ వైరస్ బారిన పడకుండా మాస్క్‌లతో ఏలూరు నగరంలో కనిపించారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్/ఏలూరు









ఎకో జోన్‌తో కొంప కొల్లేరు

నేడు ఆకివీడులో ప్రజాభిప్రాయ సేకరణ



కొల్లేరు

ఆకివీడు: కొల్లేరు సరస్సు అభయారణ్య పరిధిని రక్షించేందుకు ప్రభుత్వం ఎకో సెన్సిటివ్ జోన్‌ను ఏర్పాటు చేస్తోంది. అభయారణ్యం ఏర్పాటు జరుగుతున్న తరుణంలో ఎకో సెన్సిటివ్ జోన్ ఏర్పాటుతో తీవ్ర ఇబ్బందులు ఎదురవుతాయని పలువురు రైతులు, ఆయా గ్రామాల ప్రజలు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికే జోన్ ఏర్పాటు కోసం ప్రజాభిప్రాయ సేకరణకు ఆయా మండల కేంద్రాల్లో సదస్సులు నిర్వహిస్తున్నారు. ఆకివీడు తహసీల్దార్ కార్యాలయంలో బుధవారం మధ్యాహ్నం 2 గంటలకు సమావేశం నిర్వహించనున్నారు.

ఐదో కాంటూరు పరిధి పెంపు

కొల్లేరు సరస్సులోని అభయారణ్యం ప్రాంతమైన ఐదో కాంటూర్‌ను పరిరక్షించేందుకు మరో 10 కిలోమీటర్ల మేర ఎకో సెన్సిటివ్ జోన్ ఏర్పాటు చేయాలని ప్రభుత్వం తలపెట్టింది. కొల్లేరు సరస్సును పక్షులు విహరించేందుకు విశాలమైన ప్రాంతంగా గుర్తించారు. ఈ ప్రకారంగా ఐదో కాంటూర్ పరిధిని పెంచనున్నారు. పది కిలోమీటర్ల పరిధిలో ఏ విధమైన కట్టడాల నిర్మాణం, ఫ్యాక్టరీల నిర్మాణం, రోడ్ల నిర్మాణం చేపట్టకూడదు. చేపల చెరువులు, రొయ్యల చెరువుల సాగు చేపట్టకూడదు. కాలుష్యం, విషవాయువులు, ధ్వనులు వంటివి కొల్లేరు ఎకో సెన్సిటివ్‌లోకి రాకూడదు. సేంద్రీయ పద్ధతిలోనే వరి సాగు చేపట్టాలి. ఎరువులు, పురుగు మందుల వినియోగం చేయకూడదు. పలు కఠినమైన నిబంధనలతో ఈ జోన్‌ను ఏర్పాటు చేస్తున్నారు.

కొల్లేరు ప్రజల కష్టాలు :

కొల్లేరును అభయారణ్యంగా మార్చేందుకు గతంలో టీడీపీ ప్రభుత్వం జీఓ 120ను విడుదల చేసింది. ఈ జీఓ అమలుతో జీరాయితీ రైతులు, పలు గ్రామాల ప్రజలు నేడు తీవ్ర ఇబ్బందికి గురవుతున్నారు. జీ రాయితీ భూముల్లో వ్యవసాయం చేసుకునేందుకు తీవ్ర కష్టాలు పడుతున్నారు. అభయారణ్య భూములు అమ్మడానికి, కొనడానికి అవకాశం లేకుండా పోయింది. జీ రాయితీ భూముల్లో చెరువులు తవ్వడానికి కూడా తీవ్ర ఇబ్బందులున్నాయి. కోర్టు కేసులతో రైతులు బెంబేలెత్తుతున్నారు. కొల్లేరులోని భూములను కట్నంగా తీసుకునేందుకు వెనకాడుతున్నారు.

11 మండలాలపై ప్రభావం

ఎకో సెన్సిటివ్ జోన్ ఏర్పడితే కాళ్ల మండలంలోని సేట్ హైవేకి చేర్చి జోన్ బోర్డర్ ఏర్పడవచ్చునని పలువురు అభిప్రాయపడుతున్నారు. దీంతో కాళ్ల, కలిదిండి మండలాల్లోని కొన్ని గ్రామాలు, ఆకివీడు, కైకలూరు, మండవల్లి, నిడమర్రు, గణపవరం, ఉంగుటూరు, ఏలూరు, భీమడోలు, దెందులూరు మండలాలు సెన్సిటివ్ జోన్‌లోకి రానున్నట్లు తెలిసింది. ఆయా మండలాల్లో గత 40 ఏళ్ల నుంచి రైస్‌మిల్లులు, ఐస్ ఫ్యాక్టరీలు, ఆక్వా ప్లాంట్‌లు, ఇతర ఫ్యాక్టరీలు, వ్యాపార సంస్థలు, విద్యా సంస్థలు ఉన్నాయి. వీటన్నింటి నిర్వహణ ఎలా అనేది ప్రశ్నార్థకం కానుంది.

సాగుకు తీవ్ర ఇబ్బందులు



కొల్లేరు సరస్సును మూడో కాంటూర్‌కు కుదిస్తామన్నారు. ఇప్పుడు ఎకో సెన్సిటివ్ జోన్ అంటూ ఊరే ఖాళీ చేయాలా?. కొల్లేరు తీరంలోని సిద్ధాపురంలో మా పొలాలు సాగు చేసుకోనివ్వడం లేదు. అభయారణ్యం అంటూ ఇబ్బందులు పెడుతున్నారు. చెరువులు తవ్వనివ్వడం లేదు. పక్షులకు ఇచ్చే విలువ మనిషి బతకడానికి ఇవ్వండి.

– తోట శివాజీ, రైతు, సిద్ధాపురం, ఆకివీడు మండలం.

కొల్లేరు ప్రజలను కాపాడండి



పర్యావరణ పరిరక్షణతో పాటు ప్రజల ప్రాణాల్ని కాపాడాల్సిన పరిస్థితి ప్రభుత్వంపై ఉంది. ఎకో సెన్సిటివ్ జోన్‌తో ప్రజలు మరింత ఇబ్బంది పడతారు. భూముల విలువలు పడిపోతాయి. చిత్తడి నేలలు, అభయారణ్యం, సెన్సిటివ్ జోన్ పేరుతో కొల్లేరు తీరంలోని గ్రామాల ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు.

–జంపన సత్యనారాయణరాజు, మాజీ సర్పంచ్, సిద్ధాపురం

జోన్‌ను వ్యతిరేకిస్తున్నాం



కొల్లేరు సరస్సు పరిధిలోని ఐదో కాంటూర్ పరిధితోనే ఇబ్బంది పడుతున్నారు. సెన్సిటివ్ జోన్‌తో పరిశ్రమలు ఉండవు. ఉపాధి కోల్పోతారు. కాంటూర్ కుదింపు జరగాలి. సొసైటీల్ని పునరుద్ధరించాలి. కొల్లేరులో సెన్సిటివ్ జోన్ ఏర్పాటు చేస్తే వలసలు తప్పవు. – భూపతిరాజు తిమ్మరాజు, కొల్లేరు రైతు సంఘ ప్రతినిధి, సిద్ధాపురం

క్లుప్తంగా

విజ్ఞాన నానీలు పుస్తకం ఆవిష్కరణ



విజ్ఞాన నానీలు పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న దృశ్యం

జంగారెడ్డిగూడెం: యూటీఎఫ్ ఏర్పడి 70 ఏళ్లు పూర్తయిన సందర్భంగా కాకినాడలో మంగళవారం నిర్వహించిన స్వర్ణోత్సవ మహాసభలో యూటీఎఫ్ ఏలూరు జిల్లా గౌరవ అధ్యక్షుడు ఎంవీ శ్యాంబాబు రచించిన 'విజ్ఞాన నానీలు' అనే పుస్తకాన్ని ఆవిష్కరించారు. కృష్ణ – గుంటూరు జిల్లాల ఉపాధ్యాయ ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు, యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు ఈ పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ నానీలు పుస్తకానికి ఉభయ గోదావరి జిల్లాల గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఇళ్లా వెంకటేశ్వరరావు ముందుమాట రాశారు. నానీల ద్వారా అనేక విషయాలపై శ్యాంబాబు పాఠకులను చైతన్యం చేశారని యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు నక్కా వెంకటేశ్వరరావు అభినందించారు.

9న సబ్‌జూనియర్స్ బాలుర హాకీ జట్టు ఎంపిక

భీమవరం: పట్టణంలోని సెయింట్‌మేరీస్ స్కూల్లో జిల్లా హాకీ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈనెల 9వ తేదీన జిల్లా సబ్‌జూనియర్స్ బాలుర హాకీజట్టు ఎంపిక జరుగుతుందని అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు కేవీ భరత్, కె ఆనందరాజు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. పోటీలకు హాజరయ్యే క్రీడాకారులు 2009 తరువాత జన్మించిన వారై ఉండాలన్నారు. ఎంపికైన సబ్ జూనియర్స్ జట్టు ఈనెల 17వ తేదీ నుంచి మూడు రోజులుపాటు మదనపల్లెలో నిర్వహించే రాష్ట్రస్థాయి హాకీ పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. వివరాలకు సెల్: 90301 06037, 73966 66965 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

చీపురుగూడెంలో చైన్ స్నాచింగ్

చాట్రాయి: చీపురుగూడెంలో చైన్ స్నాచింగ్ జరిగింది. గ్రామానికి చెందిన తాతినేని కృష్ణకుమారి మంగళవారం స్థానిక విద్యుత్ సబ్‌స్టేషన్ వద్ద గేదేలు మేపుతూ రోడ్డు మీద నిలబడి ఉండగా.. గుర్తు తెలియని వ్యక్తి బైక్ మీద వచ్చి ఆమె మెడలో ఉన్న నాలుగు కాసుల బంగారు నానుతాడుని లాక్కొని పరారయ్యాడు. ఆమె ఇంటికి వచ్చి బంధువులకు విషయం చెప్పడంతో చాట్రాయి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఏఎస్సై గజపతి ఘటనా స్థలానికి వచ్చి బాధితురాలి నుంచి ఫిర్యాదు తీసుకుని కేసు నమోదు చేశారు.



పరుగు పందెంలో అభ్యర్థులు



అభ్యర్థి ఎత్తును పరిశీలిస్తున్న ఎస్పీ

కష్టపడితే రాదా విజయం.. పదరా సోదరా

ఏలూరు టౌన్: ఏపీ పోలీస్ రిక్రూట్‌మెంట్ బోర్డు చేపట్టిన కానిస్టేబుళ్ల నియామక ప్రక్రియ తొమ్మితో రోజుకు చేరుకుంది. ఏలూరు పోలీస్ పరేడ్ గ్రౌండ్స్‌లో మంగళవారం దేహదారుఢ్య పరీక్షలకు అభ్యర్థులు హాజరయ్యారు. ఏలూరు జిల్లా ఎస్పీ కొమ్మి ప్రతాప్ శివకిషోర్ ఉదయం నుంచీ గ్రౌండ్స్‌లోనే ఉంటూ పోటీలను పర్యవేక్షించారు. అభ్యర్థుల సర్టిఫికెట్లను స్వయంగా ఆయనే పరిశీలించి వివరాలు తెలుసుకుంటున్నారు. ఎంపికలకు ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాల పరిధిలో 600 మంది పురుష అభ్యర్థులకు హాల్ టిక్కెట్లు జారీ చేశారు. 419 మంది మాత్రమే హాజరుకాగా వారిలో 270 మంది ఎంపికై నట్లు ఎస్పీ శివకిషోర్ చెప్పారు. అభ్యర్థులు ఎంపిక పోటీలకు హాజరయ్యే సమయంలో తమ ఒరిజినల్, జిరాక్స్ సర్టిఫికెట్లతో రావాలని ఆయన తెలిపారు. అపీల్ చేసుకున్న అభ్యర్థులు ఈ నెల 9వ తేదీన హాజరుకావాలని ఎస్పీ తెలిపారు.



లాంగ్ జంప్ చేస్తూ..



అభ్యర్థి ఛాతీ కొలతలు తీసుకుంటున్న సిబ్బంది

రైలు ఢీకొని వృద్ధుడు మృతి

ఏలూరు టౌన్: రైలు పట్టాలు దాటుతుండగా గుర్తు తెలియని రైలు ఢీకొని వృద్ధుడు మృతి చెందినట్లు రైల్వే ఎస్సై సైమన్ తెలిపారు. ఏలూరు నగరంలోని పెన్షన్‌లైన్ ప్రాంతానికి చెందిన ఎండీ నసీం (60) గనీబజార్ సమీపంలో ఉన్న రైల్వే ట్రాక్ దాటుతుండగా గుర్తు తెలియని రైలు ఢీకొనడంతో నసీం మృతి చెందాడు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలంలో మృతదేహాన్ని గుర్తించి పోస్టుమార్టం నిమిత్తం జీజీహెచ్‌కు తరలించారు. రైల్వే ఎస్సై సైమన్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఏపీ నిట్ ఇన్‌చార్జి డైరెక్టర్‌కు జీవితకాల సాఫల్య పురస్కారం



జీవితకాల సాఫల్య పురస్కారం అందుకుంటున్న ఎన్‌వీ రమణరావు

తాడేపల్లిగూడెం: ఏపీ నిట్ ఇన్‌చార్జి డైరెక్టర్ ప్రొఫెసర్ ఎన్‌వీ రమణరావు జీవితకాల సాఫల్య పురస్కారాన్ని అందుకున్నారు. సివిల్ ఇంజినీరింగ్ రంగంలో విశేష సేవలందించినందుకుగాను ఇండియన్ కాంక్రీట్ ఇనిస్టిట్యూట్ హైదరాబాద్ సెంటర్ ఈ అవార్డు అందజేసింది. సెంటర్ చైర్మన్ డాక్టర్ వెంకటేశ్వరరావు రమణారావుకు అవార్డును అందజేసి సత్కరించారు. ఈ సందర్భంగా రిజిస్ట్రార్ పి.దినేష్ శంకర్ రెడ్డి, విభాగాధిపతులు జీఆర్‌కే శాస్త్రి, వి.సందీప్, ఎన్.జయరామ్, హిమబిందు తదితరులు రమణరావుకు అభినందనలు తెలిపారు.

ఎన్నికల హామీలు తాత్సారం చేస్తూ మోసం

సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి నాగేశ్వరరావు



తణుకులో విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి నాగేశ్వరరావు

తణుకు అర్బన్: ఎన్నికల హామీల అమలులో తాత్సారం చేస్తూ కూటమి ప్రభుత్వం ప్రజల్ని మోసం చేసే విధంగా వ్యవహరిస్తోందని సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాల నాగేశ్వరరావు అన్నారు. తణుకు సురాజ్య భవన్‌లో మంగళవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. అధికారంలోకి వచ్చిన తరువాత విద్యుత్ చార్జీలను పెంచబోమని చెప్పిన కూటమి నేతలు ఇప్పటికే ప్రజలపై రూ.8 వేల కోట్లు భారం మోపారని, మరో రూ.11 వేల కోట్ల భారం మోపేందుకు యత్నిస్తురాని, ఈ నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. అలాగే ధాన్యం రైతులకు న్యాయమైన ధరలు లభించడంలేదని, తేమ పేరుతో కోత విధిస్తున్నారని, మిల్లుల వద్ద బస్తాకు రెండు నుంచి మూడొందలు తక్కువ ఇస్తున్నారని విమర్శించారు. అగ్రిగోల్డ్ బాధితులకు సత్వర న్యాయం చేయకపోవడంతో ఈ 6 మాస్సాల్లో 12 మంది అగ్రిగోల్డ్ బాధితులు ఆత్మహత్యలు చేసుకున్నారని దుయ్యబట్టారు. చంద్రబాబు, లోకేష్, పవన్ కల్యాణ్‌ల మాటల్లో ఏమాత్రం విశ్వసనీయత ఉన్నా విశాఖ వస్తున్న ప్రధాని మోడీతో విశాఖ స్టీల్ ప్లాంట్‌ను ప్రైవేటీకరణ చేయమని, స్టీల్ ప్లాంట్‌కు కావాల్సిన గనులను కేటాయిస్తామని ఈ రెండు మాటలు చెప్పించలేకపోతే రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యం కిందే ప్రజలు చూస్తారని హెచ్చరించారు. ఈ సమావేశంలో సీపీఐ జిల్లా కార్యదర్శి కోనాల భీమారావు, సీపీఐ రాష్ట్ర సమితి సభ్యులు కలిశెట్టి వెంకట్రావు, సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యురాలు సికిలే పుష్పకుమారి తదితరులు పాల్గొన్నారు.

మేజిక్ బోస్‌కు ఐబీఆర్ అచీవర్ అవార్డు



ఐబీఆర్ అచీవర్ అవార్డుతో మేజిక్ బోస్

భీమవరం: పట్టణానికి చెందిన మేజిక్ స్టార్ దంతులూరి సత్యనారాయణరాజు(బోస్)కు ఇండియా బుక్ ఆఫ్ రికార్డ్స్ సంస్థ 'ఐబీఆర్ అచీవర్' అవార్డును ప్రదానం చేసింది. నాలుగేళ్ల క్రితం బోస్ రచించిన 'నా ప్రస్థానం' పుస్తకాన్ని అరుదైన గ్రంథంగా గుర్తించిన ఆ సంస్థ కొరియర్‌లో బోస్‌కు ఈ అవార్డును పంపించింది. మేజిక్ రంగంలో మెజీషియన్‌గా, రచయితగా 50 ఏళ్ల తన అనుభవాలతో బోస్ చేసిన స్వీయ చరిత్ర 'నా ప్రస్థానం' అని ఆ సంస్థ తన సర్టిఫికెట్‌లో పేర్కొంది. గతేడాది బోస్ మరో రచన 'మేజిక్ గైడ్'కు కూడా ఇండియా బుక్ ఆఫ్ రికార్డ్స్ నుంచి పురస్కారం లభించడం విశేషం.

నేషనల్ ఆర్చరీలో కాంస్య పతకం



కాంస్య పతకంతో సూర్యహంసిని

భీమవరం: కాంపౌండ్ మహిళల జాతీయ విలువిద్య అండర్–18 సబ్ జూనియర్ కేటగిరి పోటీల్లో భీమవరంనకు చెందిన మాదాల సూర్యహంసిని కాంస్య పతకాన్ని గెల్చుకుంది. ఈనెల 3వ తేదీ నుంచి రాజస్తాన్‌లోని జైపూర్ పూర్ణిమ విశ్వవిద్యాలయంలో 41వ ఎన్‌టీపీసీ సబ్ జూనియర్ జాతీయ ఆర్చరీ చాంపియన్‌షిప్ పోటీలు నిర్వహించారు. ఈపోటీల్లో సూర్యహంసిని వ్యక్తిగత కేటగిరిలో కాంస్య పతకం సాధించగా టీమ్ ఈవెంట్‌లో రాష్ట్ర జట్టులో భీమవరం పట్టణానికి సూర్యహంసిని, కర్రి సుస్మిత విజయవాడకు చెందిన బుడ్డే షణ్ముఖినాగసాయి, కామినేని రిషి ఢిల్లీ జట్టుపై విజయం సాధించి కాంస్య పతకం సాధించారు. అలాగే మిక్స్‌డ్ టీమ్ ఈవెంట్‌లో రాష్ట్ర జట్టు తరపున సూర్యహంసిని, విజయవాడకు చెందిన పల్లపు చరణ్ శ్రీకర్ మహారాష్ట్ర జట్టుపై విజయం సాధించి బంగారు పతకాన్ని గెల్చుకున్నట్లు ఏపీ స్టేట్ ఆర్చరీ అసోసియేషన్ కార్యదర్శి చెరుకూరి సత్యనారాయణ, జిల్లా కార్యదర్శి జయరాజు మంగళవారం తెలిపారు.

యండగండిలో దారిదోపిడీ

ఉండి: ఆటోలో కుమార్తె ఇంటికి వెళుతున్న ఇద్దరు వృద్ధులపై దుండగులు దారి దోపిడీకి పాల్పడ్డారు. ఎస్సై ఎండీ నసీరుల్లా తెలిపిన వివరాల ప్రకారం ఉండి మండలం ఉణుదుర్రు గ్రామానికి చెందిన కూనపరాజు పద్మావతి, ఆమె భర్త సుబ్బరాజు ఈ నెల 4వ తేదీన భీమవరంలోని చిన్నకుమార్తె రోహిణీ ఇంటికి వెళ్లేందుకు భీమవరం రోడ్డులో ఆటో ఎక్కారు. అయితే యండగండి ప్రాంతానికి రాగానే నిర్మానుష్య ప్రాంతంలో ఆటో ఆపి వృద్ధురాలి వద్ద 3 సవర్ల బంగారు గొలుసు, పర్సులోని రూ.3 వేలు దొంగిలించి పరారయ్యారు. దీనిపై బాధితురాలు పద్మావతి పోలీసులకు ఫిర్యాదు చేసింది.

కొల్లేరు ప్రజల పొట్టలు కొట్టొద్దు

వడ్డీ సాధికారిత రాష్ట్ర కన్వీనర్ ఏసురాజు



సమావేశంలో మాట్లాడుతున్నా బలే ఏసురాజు

కైకలూరు: కొల్లేరు ప్రజల పొట్టలు కొట్టొద్దని వడ్డీ సాధికారిత రాష్ట్ర కన్వీనర్ బలే ఏసురాజు అన్నారు. కైకలూరు ట్రావెలర్స్ బంగ్లాలో ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లాల కొల్లేరు గ్రామాల పెద్దలు మంగళవారం సమావేశమయ్యారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న బలే ఏసురాజు మాట్లాడుతూ కొల్లేరు అభయారణ్యంలో కొత్త చెరువుల తవ్వకాలు జరగడం లేదన్నారు. పూర్వం నుంచి సాగుతున్నా చెరువుల గట్లు సైతం ధ్వంసం చేయడం ప్రజల హక్కులను కాలరాయడమే అన్నారు. సాంప్రదాయ సాగునకు అభ్యంతరం చెప్పవద్దని ప్రభుత్వాలు చెప్పాయని ఈ సందర్భంగా గుర్తు చేశారు. కొల్లేరు హద్దులు తెలియని కొందరు సుప్రీంకోర్టులో కేసులు వేయడం వల్ల కొల్లేరు వాసులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. కొల్లేరులో జీవన పరిస్థితులు అధ్యయనం చేసి నిర్ణయాలు తీసుకోవాలన్నారు. ఇప్పటికే అనేక మంది జీవనోపాధి కోసం ఇతర ప్రాంతాలకు వలసలు పోయారన్నారు. పార్టీలకు అతీతంగా అందరూ కొల్లేరు ప్రజల పక్షనా నిలవాలని అభ్యర్థించారు. కొల్లేరు సమస్యలను స్థానిక నాయకుల ద్వారా ప్రభుత్వం దృష్టికి తీసుకువెళతామని చెప్పారు. కార్యక్రమంలో కొల్లేరు నాయకులు సైదు సత్యనారాయణ, కూటమి నేతలు పెన్మత్స త్రినాథరాజు, కొల్లిబాబి, మంగర మల్లికార్జునరావు, డీసీ చైర్మన్ వాసురాజు తదితరులు పాల్గొన్నారు.


మృతుల కుటుంబాలకు ఎక్స్‌గ్రేషియా ప్రకటించాలి



మాట్లాడుతున్న మడకరాజు

తాడేపల్లిగూడెం (టీఓసీ): గేమ్ చేంజర్ ఈవేంట్‌కు కాకినాడకు చెందిన పాలుపూరి మణికంఠ, తోకడ చరణ్ హాజరై తిరుగు ప్రయాణంలో రంగంపేట వద్ద వ్యాన్ ఢీకొని మృతి చెందారని, వారి కుటుంబాలకు రూ.కోటి ఎక్స్‌గ్రేషియా ప్రకటించాలని ఏపీ రజక వృత్తిదారుల సంఘం జిల్లా కార్యదర్శి మడక రాజు రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సంఘ జిల్లా కమిటీ సమావేశం స్థానిక పుచ్చలపల్లి సుందరయ్య భవనంలో యండమూరి నాగేంద్ర అధ్యక్షతన మంగళవారం జరిగింది.

కళ్లల్లో కారం కొట్టి కత్తితో దాడి



గాయపడిన సాంబశివరావు

నూజివీడు: పట్టణంలోని రోటరీ ఆడిటోరియం సమీపంలో నివాసముండే పులేరు వెంకట సాంబశివరావు(56)పై మంగళవారం గుర్తుతెలియని దుండగుడు కళ్లల్లో కారం చల్లి కత్తితో దాడి చేయడంతో తీవ్ర గాయాలయ్యాయి. వివరాలు ఇలా ఉన్నాయి. ఉదయం 10.15 గంటల సమయంలో సాంబశివరావు ఒక్కడే ఇంట్లో ఉండగా దుండగుడు మాస్కు ధరించి వచ్చి సాంబశివరావు కళ్లల్లో కారం కొట్టి కత్తితో దాడి చేశాడు. అతను పక్కకు తప్పుకోవడంతో ఎడమ చేతి భుజం కింద, కుడి చెవి వెనుక భాగాన తీవ్ర గాయాలయ్యాయి. ఒక్కసారిగా సాంబశివరావు కేకలు వేస్తూ ఇంటిలో నుంచి బయటకు రావడంతో దుండగుడు గోడదూకి పారిపోయాడు. చుట్టుపక్కల వారు సాంబశివరావును పట్టణంలోని ఏరియా ఆసుపత్రిలో చేర్చారు. పట్టణ సీఐ పీ సత్య శ్రీనివాస్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



విద్యుద్దీప కాంతులీనుతున్న ఆలయ తూర్పు రాజగోపుర ప్రాంతం



జంట గోపురాల ప్రాంతంలో స్వామి, అమ్మవార్ల భారీ విద్యుత్ కటౌట్

'ముక్కోటి' కాంతులు

- విద్యుద్దీప కాంతులీనుతున్న శ్రీవారి క్షేత్రం
- రేపు మధ్యాహ్నం 3 గంటల నుంచి స్వామివారి గిరి ప్రదక్షిణ
- 10న ఉదయం 5 గంటల నుంచి ఉత్తర ద్వార దర్శనం
- తుది దశకు చేరుకున్న ఏర్పాట్లు

ద్వారకాతిరుమల: శ్రీవారి గిరి ప్రదక్షిణ, అలాగే ఉత్తర ద్వార దర్శనానికి ద్వారకాతిరుమల దివ్య క్షేత్రం సర్వాంగ సుందరంగా ముస్తాబవుతోంది. అందులో భాగంగా ఆలయ రాజగోపురాలు, పరిసరాలు, అనివేటి మండపం, ఘాట్ రోడ్లు విద్యుద్దీప కాంతులతో దగదగలాడుతున్నాయి. కొండపైన జంటగోపురాల వద్ద ఏర్పాటు చేసిన స్వామి, అమ్మవార్ల భారీ విద్యుత్ కటౌట్ చూపరులను ఆకట్టుకుంటోంది. ఏర్పాట్లు తుది దశకు చేరుకున్నాయి. ఈనెల 9న మధ్యాహ్నం 3 గంటలకు, స్వామివారి పాదుకా మండపం వద్ద నుంచి గిరి ప్రదక్షిణ వేడుక ప్రారంభం కానుంది. అలాగే ముక్కోటి ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని 10న ఉదయం 5 గంటల నుంచి భక్తులకు శ్రీవారి ఉత్తర ద్వార దర్శన భాగ్యం కలగనుంది. దేవస్థానం వారు ఉత్తర ద్వార దర్శనం ప్రత్యేక రూ.500 టికెట్లను ఆన్‌లైన్ ద్వారా విక్రయిస్తున్నారు. గర్భాలయంలో స్వామివారు గురువారం సాయంత్రం నుంచి, శుక్రవారం సాయంత్రం వరకు నిజరూపంలో దర్శనమివ్వనున్నారు. ఈ వేడుకల్లో భక్తులు పాల్గొనాలని ఆలయ ఇన్‌చార్జి ఈఓ త్రినాధరావు కోరారు.



విద్యుత్ అలంకారాల్లో మొక్క ఏనుగు



విద్యుత్ కాంతుల్లో ఆలయ జంట గోపురాలు



విద్యుత్ కాంతులతో ధగధగలాడుతున్న అనివేటి మండపం

దళితుల సమస్యలపై రాష్ట్ర వ్యాప్త ఉద్యమం



సమావేశంలో మాట్లాడుతున్న వెంకటేశ్వర్లు

ఏలూరు (టూటౌన్): దళిత సమస్యలపై రాష్ట్రవ్యాప్త ఉద్యమం చేపడుతున్నట్లు ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కార్యదర్శి వి.వెంకటేశ్వర్లు తెలిపారు. సంఘం రాష్ట్రస్థాయి సమావేశాలు మంగళవారం ముగిశాయి. ఈ సందర్భంగా నిర్వహించిన సమావేశంలో వెంకటేశ్వర్లు మాట్లాడుతూ దళితులపై జరుగుతున్న దాడులు, అత్యాచారాలు, వివక్షత, అంటరానితనంపై రాష్ట్ర వ్యాప్తంగా జనవరి, ఫిబ్రవరి మాసాల్లో ఉద్యమం చేపడుతున్నట్లు తెలిపారు. బీజేపీ మతోన్మాద చర్యలకు వ్యతిరేకంగా రాబోయే కాలంలో అన్ని ప్రజాసంఘాలు ఈ ఉద్యమంలో కలిసి రావాలని పిలుపునిచ్చారు. రాష్ట్ర, జిల్లా నాయకులు ఏ.రవి, తామా ముత్యాలమ్మ, పి రామకృష్ణ, ఎస్ మహంకాళిరావు పాల్గొన్నారు.

క్లుప్తంగా

27 మందికి ఉచిత వైద్య సేవలు


వృద్ధులకు వైద్యసేవలందిస్తున్న దృశ్యం

తణుకు అర్బన్: సజ్జాపురం సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మంగళవారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. స్థానిక రాష్ట్రపతి రోడ్డులోని అసోసియేషన్ కార్యాలయంలో నిర్వహించిన ఈ శిబిరంలో సీనియర్ వైద్యులు డాక్టర్ భూపతిరాజు రమేష్‌చంద్ర బాబు 27 మంది వృద్ధులకు వైద్యసేవలు అందజేసి, ఆహార అలవాట్లు, వ్యాయామం, నడక వంటి విషయాలపై అవగాహన కల్పించారు. వృద్ధులకు ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు అద్దాల సత్యనారాయణ, సంఘ అధ్యక్షుడు ఈదర ప్రసాదరావు, కార్యదర్శి కోసూరి గాంధీ, సభ్యులు ఇవటూరి లక్ష్మణరావు, చేబ్రోలు సాధు తదితరులు పాల్గొన్నారు.

ముగ్గురిపై కేసు నమోదు

అత్తిలి: పాలి గ్రామంలో వేండ్ర సుబ్బులక్ష్మి గృహం ముందు ఏర్పాటు చేసుకున్న సీసీ కెమేరాలను ధ్వంసం చేయడంతో పాటు పిల్లలను చంపుతామని బెదిరించినట్లు వచ్చిన ఫిర్యాదుపై కేసు నమోదు చేసినట్లు ఏఎస్సై పి.సత్యనారాయణ మంగళవారం తెలిపారు. పాలి గ్రామంలో సుబ్బులక్ష్మి ఇంటి సరిహద్దులో కృష్ణవేణి గృహం ఉంది. గత ఏడేళ్లుగా సుబ్బులక్ష్మి ఇంటివైపు చెత్త వేయడంతో పాటు ఆమెను, ఆమె పిల్లలను చంపుతామని కృష్ణవేణి తదితరులు బెదిరిస్తున్నారని, దీంతో సుబ్బులక్ష్మి ఈనెల 6న ఇంటి ఆవరణలో రెండు సీసీ కెమేరాలను ఏర్పాటు చేసుకుందని తెలిపారు. చింతపల్లి కృష్ణవేణి, తులసి, మల్లేశ్వరిలు సీసీ కెమేరాలను పగులకొట్టారని, సుబ్బులక్ష్మి ఇచ్చిన ఫిర్యాదు మేరకు ముగ్గురిపై కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నామని ఏఎస్సై సత్యనారాయణ తెలిపారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

తాడేపల్లిగూడెం (టీఓసీ): సీజనల్ వ్యాధులపై ప్రజలు అవగాహన కలిగి ఉండాలని, వ్యక్తిగత పరిశుభ్రత వ్యాధుల నుంచి రక్షిస్తుందని మలేరియా సబ్ యూనిట్ అధికారి వై.వి.లక్ష్మణరావు అన్నారు. పట్టణ ఆరోగ్య కేంద్రాలు యాగర్లపల్లి, కడకట్ల, ఎన్‌టీఆర్ జంక్షన్, వీకర్స్‌కాలనీలలో మంగళవారం ఆశా డేలు జరిగాయి. వైద్యాధికారులు కె.రవికుమార్, తనూజ, శ్రావ్యలు అధ్యక్షత వహించారు. ప్రజలకు కీటక జనిత వ్యాధులు, వెక్టర్ కంట్రోల్ హైజీన్, ప్రజలకు ఆరోగ్య కార్యక్రమాలపై అవగాహనలు చేయాలని చెప్పారు. పలు సూచనలు ఇచ్చారు. హెల్త్ సిబ్బంది మంగతయారు, పద్మ, వెంకటలక్ష్మి, అనంతలక్ష్మి, హెల్త్ సెక్రటరీలు, ఆరోగ్య సహాయకులు పాల్గొన్నారు.

అలంపురంలో ఉచిత వైద్యపరీక్షలు


అలంపురంలో వృద్ధుడికి వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్ పూజిత

పెంటపాడు: మండలంలో ఫ్యామిలీ వైద్యపరీక్షలలో భాగంగా మంగళవారం అలంపురం నెంబర్–2 సబ్ సెంటర్‌లో వైద్యపరీక్షలు జరిగాయి. అంగన్‌వాడీ సెంటర్, ప్రాథమిక పాఠశాల విద్యార్థులతో పాటు, గ్రామంలో పలువురు వృద్ధులను, బాలింతలు, గర్భిణులకు ముదునూరు ప్రాథమిక వైద్యాధికారిణి పూజిత ఆధ్వర్యంలో వైద్యపరీక్షలు జరిగాయి. 104 సేవలలో భాగంగా మరో 60 మందికి సబ్‌సెంటర్ సిబ్బంది సేవలందించారు. ఈ కార్యక్రమంలో సీహెచ్‌వో కీర్తి, ఏఎన్ఎంలు, సిబ్బంది పాల్గొన్నారు.

ఎల్ఎల్ఎం ఆధ్వర్యంలో నిత్యావసరాల పంపిణీ


మున్సిపల్ పారిశుద్ధ్య సిబ్బందికి కిట్లు అందజేస్తున్న దృశ్యం

పెంటపాడు: గూడెం భాగ్యలక్ష్మీపేట ఎల్ఎల్ఎం చర్చిలో మంగళవారం హెల్పింగ్ టీం ఆధ్వర్యంలో మున్సిపల్ శానిటరీ సిబ్బందికి, వృద్ధులకు, పేదలకు నిత్యావసర సరుకులు అందజేశారు. ఈ సందర్భంగా ఎల్ఎల్ఎం సంస్థ అధ్యక్షుడు మల్లిపూడి జైబాబు మాట్లాడుతూ మున్సిపల్ వర్కర్స్ చేస్తున్న పని ఎంతో విలువైనదన్నారు. గత కరోనాతో పాటు, ప్రస్తుతం ప్రతి రోజూ చలిని లెక్క చేయకుండా మున్సిపల్ కార్మికులు డ్రెయినేజీలు శుభ్రం చేయడం, చెత్తను నిర్మూలించడం పట్ల ఎంతో కృషి చేస్తున్నారన్నారు. ప్రజలు వారిని గుర్తించాలన్నారు. ఈ కార్యక్రమంలో హెల్పింగ్ హేండ్స్ అధ్యక్షుడు శిరపరపు శాంతిరాజు, పాస్టర సువర్ణరాజు, విజయకుమార్ మున్సిపల్ మజీ వైస్ చైర్మన్ గొర్రెల శ్రీధర్, వర్తనపల్లి కాశీ, ఎల్ఎల్ఎం కుటుంబసభ్యులు, చర్చిసంఘ సభ్యులు పాల్గొన్నారు.

ఆరోగ్య నియమాలే రక్ష

- శీతాకాలంలో విజృంభిస్తున్న సీజనల్ వ్యాధులు
- ఉష్ణోగ్రతల్లో వ్యత్యాసమే కారణం
- గుండె ఆస్తమా, మధుమేహం పట్ల జాగ్రత్తలు అవసరం
- పిల్లలు, వృద్ధులు అప్రమత్తంగా ఉండాల్సిన తరుణం



రోగులకు ఆరోగ్య సూచనలు చేస్తున్న వైద్య సిబ్బంది

ఇరగవరం : శీతాకాలంలో చలిపులి పంజా విసురుతోంది. వాతావరణంలో అనూహ్య మార్పులు చోటు చేసుకోవడంతో ప్రజలు రోగాల బారిన పడుతున్నారు. వృద్ధులు, చిన్నారులలో రోగ నిరోధక శక్తి తక్కువగా ఉండడంతో తేలికగా సీజనల్ వ్యాధులు చుట్టుముడుతున్నాయి. దీంతో ఆస్పత్రులకు వ్యాధి పీడితుల సంఖ్య పెరుగుతోంది. రోగాల బారిన పడకుండా తగు జాగ్రత్తలు తీసుకోవడం మేలని ఆరోగ్య నిపుణులు సూచిస్తున్నారు. చల్లటి వాతావరణంలో ఎక్కువ సమయం గడపకుండా అప్రమత్తంగా ఉండాలి. సాధ్యమైనంత వరకు వేకువ జామున, రాత్రి వేళల్లో బయట సంచరించకుండా ఉంటే ఉత్తమం. ప్రధానంగా పిల్లలు, వృద్ధుల ఆరోగ్య పరిరక్షణలో తగు జాగ్రత్తలు తీసుకోవడం మంచిది. ఏమాత్రం అనారోగ్యం తలెత్తినా వెంటనే వైద్యులకు సంప్రదించాలి. సకాలంలో చికిత్స అందించాలి. దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులు సైతం మరింత జాగ్రత్తగా ఉండడం మంచిది. శీతాకాలంలో తీసుకోవలసిన చర్యలపై వైద్యులు పలు సూచనలు చేస్తున్నారు.

వ్యాయామం తగ్గించాల్సిందే

ఉదయం పొగ మంచు, ఈదురు గాలులు విజృంభిస్తుంటాయి. దీంతో శ్వాసకోస వ్యాధిగ్రస్తులు ఉక్కిరిబిక్కిరి అవుతంటారు. వ్యాయామం చేసే విషయంలో తగిన జాగ్రత్తలు పాటించాలి. వ్యాయామం పేరుతో గంటల కొద్దీ ఓపెన్ ఎయిర్ గ్రౌండ్స్, పార్కులలో తిరగడం తగ్గించాలి. ఇంట్లో, ఇండోర్ స్టేడియంలో మాత్రమే వ్యాయామం చేయడం మంచిది. అరగంట పాటు సురక్షత ప్రాంతంలో నడక, ఆటలు కొనసాగించాలి.

బయటి ఆహారం వద్దు

వాతావరణం చల్లగాఉంటే వేడి వేడి పకోడీలు, బజ్జీలు, బోండాలను విపరీతంగా లాగించేస్తుంటారు. శీతాకాలంలో అలాంటి ఆహార పదార్థాలకు కొన్ని రోజుల పాటు విరామం ఇవ్వాలి. లేదంటే ఆరోగ్యానికి చాలా ప్రమాదకరం. ఫైబర్ అధికంగా ఉండే కూరగాయలు, ఆకు కూరలు, ఏ, సీ, కే విటమిన్లు పుష్కలంగా లభించే పదార్థాలను తీసుకోవాలి.

గోరువెచ్చని నీటితో ఉపశమనం

చల్లదనంతో ఊపిరితిత్తులలోని పొరలు అతిగా స్పందిస్తాయి. కూల్ డ్రింక్‌లు, ఫ్రిజ్‌లో పెట్టిన వాటిని సేవించడం ప్రమాదకరం. జలుబు, దగ్గు, జ్వరం బారిన పడిన వారు గోరువెచ్చని నీటిని తాగితే కాస్త ఉపసమనంగా ఉంటుంది. ధూమపానానికి దూరంగా ఉండడం శ్రేయస్కరం.

జాగ్రత్తలు తప్పనిసరి



చలికాలంలో ఆరోగ్యవంతులు సైతం వ్యాధుల బారిన పడే అవకాశం ఎక్కువ. గుండె జబ్బులు ఉన్నవారు అప్రమత్తంగా ఉండాలి. చిన్న తేడా కనిపించినా వైద్యులను సంప్రదించాలి. శీతల పానీయాలు, పదార్థాల జోలికి వెళ్లకూడదు. వ్యాధి నిరోధక శక్తిని పెంచే ఆహారం తీసుకోవాలి. వృద్ధులు, చిన్న పిల్లలు మంచులో తిరగకుండా ఉంటే మంచిది. గోరు వెచ్చని నీటినే తాగాలి. ఇంట్లో చేసిన ఆహార పదార్థాలను మాత్రమే తినడం ఆరోగ్యకరం.

– బంగారు రవి, రేలంగి పీహెచ్‌సీ వైద్యాధికారి

తస్మాత్ జాగ్రత్త

ప్రస్తుతం ఉష్ణోగ్రత్తలు గణనీయంగా పడిపోతున్నాయి. చలి తీవ్రత పెరిగే కొద్దీ రక్తనాళాలు సంకోచిస్తాయి. దీంతో అవయవాలకు రక్తప్రసరణ చేసే గుండె మరింత వేగంగా పనిచేయాల్సి ఉంటుంది. ఆక్సిజన్‌తో కూడిన రక్త సరఫరా తగ్గడంతో గుండెపోటు వచ్చే అవకాశాలు ఎక్కువ. గుండె జబ్బులు, మధుమేహం, అస్తమా వ్యాధిగ్రస్తులకు ఒక విధంగా శీతాకాలం శత్రువే. శరీరం వ్యాధుల బారినపడేది ఈసీజన్‌లోనే. ఎప్పుడైనా గుండెలో చిన్న నొప్పిగా అనిపిస్తే వెంటనే దగ్గరలోని ఆస్పత్రికి వెళ్లి డాక్టర్‌ను సంప్రదించాలి. రోగ నిరోధక శక్తి తక్కువగాఉన్న చిన్నారుల విషయంలో జాగ్రత్తలు వహించాలి. ఉదయం, రాత్రి వెళల్లో పిల్లలను బయటకురానివ్వకుండా చూసుకోవాలి. వయోవృద్ధులుసైతం జాగ్రత్తలు పాటించకుంటే వైరస్ దాడి చేసే ప్రమాదం ఉంది. శీతాకాలంలో పెంపుడు జంతువులకు దూరంగా ఉండడం ఉత్తమం. వైరస్‌ల వ్యాప్తికి పెంపుడు జంతువులు ప్రధాన కారణమని, వైరాలజీ నిపుణులు చెబుతున్నారు. ఈ కాలంలో నిద్ర గది, వంటగదిలోనికి రానివ్వకుండా అదుపు చేయడం మంచిది. వయోవృద్ధులు, దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడే వారు పెంపుడు జంతువుల దరిదాపుల్లోకి కూడా వెళ్లకూడదని వైద్యులు సూచిస్తున్నారు.

ఎరువుల దుకాణాల్లో తనిఖీలు


జగన్నాథపురం ఎరువుల దుకాణాల్లో తనిఖీలు నిర్వహిస్తున్న విజిలెన్స్ అధికారులు

తాడేపల్లిగూడెం రూరల్: మండలంలోని జగన్నాథపురం గ్రామంలోని ఎరువులు, పురుగు మందుల దుకాణాల్లో విజిలెన్స్, రెవెన్యూ, వ్యవసాయ శాఖ అధికారులు సంయుక్తంగా తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీలక్ష్మీగణపతి ఫెర్టిలైజర్స్, పెస్టిసైడ్‌లో అధిక ధరలకు విక్రయిస్తున్నట్లుగా గుర్తించినట్లు విజిలెన్స్ ఇన్‌స్పెక్టర్ శివరామకృష్ణ తెలిపారు. ఈ షాపులో రూ.1,80,305లు విలువైన 12,150 మెట్రిక్ టన్నుల ఎరువుల భౌతిక నిల్వల్లో వ్యత్యాసం ఉన్నట్లు గుర్తించి సీజ్ చేశారు. సత్య భవాని ట్రేడర్స్‌లో రూ.1,44,375లు విలువ గల 5250మెట్రిక్ టన్నులు ఎరువులు భౌతిక నిల్వలలో వ్యత్యాసం గుర్తించి సీజ్ చేశామన్నారు. ఈ రెండు షాపులపై ఫెర్టిలైజర్స్ కంట్రోల్ ఆర్డర్ 1985 సెక్షన్ 6(ఎ) నిత్యావసరాల చట్టం 1955 ప్రకారం కేసు నమోదు చేసినట్లు వివరించారు. విజిలెన్స్ ఏవో జి.మీరయ్య, మండల ఇన్‌చార్జ్ వ్యవసాయాధికారి కే.పార్థసారథి, రెవెన్యూ అధికారులు ఉన్నారు.

జంతు సంక్షేమ సంఘం జిల్లా డైరెక్టర్‌గా అజయ్‌కుమార్ నియామకం

అత్తిలి: జంతు సంక్షేమ సంఘం జిల్లా డైరెక్టర్‌గా అత్తిలికి చెందిన ఆల్తి అజయ్‌కుమార్‌ను జిల్లా కలెక్టర్ సి నాగరాణి మంగళవారం నియమించడంపట్ల స్థానిక నాయకులు హర్షం వ్యక్తం చేసారు. నోరులేని మూగజీవాల పట్ల ప్రజలు జాలి, కరుణ, దయ చూపించాలని ఆల్తి అజయ్‌కుమార్ అన్నారు.

ఆవిష్కరణల వేదిక.. విజ్ఞాన వీచిక!

ఆకట్టుకున్న విద్యార్థుల ప్రదర్శనలు



శరీర నిర్మాణంపై టీచర్ ప్రాజెక్ట్


వరి ధాన్యం రక్షణ యంత్రం గ్రూపు ప్రాజెక్ట్


సైన్స్ ప్రాజెక్టులను పరిశీలిస్తున్న ఎంఈఓలు

తాడేపల్లిగూడెం (టీఓసీ): చదువంటే పాఠ్య పుస్తకాలు, పరీక్షలు, మార్కులే కాదు, సామాజిక పరిస్థితులపై అవగాహన, పర్యావరణ పరిరక్షణ మానవీయ విలువలు నేర్వాలి. అప్పుడే విద్యా వికాసం సాధ్యమవుతుంది. నేటి సైన్స్ రంగం పట్ల విద్యార్థులు విశేషంగా ఆసక్తి ప్రదర్శిస్తున్నారు. ఇటీవల మండల స్థాయి, జిల్లా స్థాయి ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థులు రూపొందించిన సైన్స్ ప్రదర్శనలు విశేషంగా ఆకట్టుకున్నాయి. విద్యార్థులు లోతైన ఆలోచనలు చేసే విధంగా సైన్స్ ఉపాధ్యాయులు సైతం ప్రోత్సాహం అందజేస్తున్నారు. నూతన ఆవిష్కరణలు పదును పెరుగుతుంది. మండల స్థాయిలో రూరల్, పట్టణ ప్రాంతాలకు చెందిన స్కూల్స్ 26 ఉన్నత పాఠశాలలకు చెందిన విద్యార్థినీ విద్యార్థులు 78 ప్రదర్శనలు ఇచ్చారు. ఈ ప్రదర్శనలకు పట్టణంలోని కోడే వెంకట్రావు మునిసిపల్ ఉన్నత పాఠశాల వేదికగా నిలచింది. సైన్స్ ఫెయిర్‌లో వ్యక్తిగతం, గ్రూపు, టీచర్‌కు సంబంధించి మూడు విభాగాల్లో ప్రదర్శలు ఆకట్టుకున్నాయి. మండల విద్యాశాఖాధికారులు వి.హనుమ, పీఎంకే జ్యోతిలు సైన్స్‌ఫెయిర్‌లకు అధ్యక్షుడిగా వ్యవహరించారు. ఎం.శ్రీనివాసరావు, పి.పార్వతి, నోడల్ హెచ్ఎం ఎస్.ఎస్ శ్రీనివాస్ (ఆరుగొలను) నోడల్ టీచర్స్ డి.మల్లికార్జునరావు, సీహెచ్‌బీ రవికుమార్‌లు న్యాయ నిర్ణేతలుగాను, సహాయకులుగాను వ్యవహరించారు. ఈ సైన్సు ప్రదర్శనలు పట్ల విద్యార్థులు సైతం ఆసక్తిగాను, ఉత్సాహంగాను ఉంటున్నారు. మరిన్ని ప్రదర్శనలకు ఈ వేదిక ఎంతో ఉపయోగపడుతుందని అటు ఉపాధ్యాయులు, ఇటు విద్యార్థులు ఆసక్తి ప్రదర్శిస్తున్నారు.

ఆకట్టుకున్న ప్రదర్శనలు:

టీచర్ ప్రాజెక్ట్‌లో భాగంగా శరీర నిర్మాణంపై ఆసక్తి ప్రదర్శన సాగింది. శరీర నిర్మాణం, అందలి అవయవాలు పనితీరు గురించి విద్యార్థులు సులభంగా అర్థం చేసుకోవడానికి తక్కువ ఖర్చుతో తయారు చేశారు. ఎక్కువ కాలం ఉపయోగపడే విధంగా ఎక్షిబిట్ రూపొందించారు. ఈ ప్రాజెక్ట్‌ను ఎంఈడీఓ మునిసిపల్ హైస్కూల్ తాడేపల్లిగూడెం టీచర్ బి.అరుణ రూపొందించారు. విద్యార్థులు ఈ ప్రదర్శనను ఆసక్తిగా పరిశీలించారు. జిల్లా స్థాయికి సైతం ఎంపికై ఆకట్టుకుంది.

వ్యక్తిగత ప్రాజెక్ట్‌లో భాగంగా లేజర్ సెక్యూరిటీ సిస్టమ్ పై ప్రదర్శన సాగింది. ఈ పద్ధతిలో సాధారణ గృహాలు, ఆఫీసులు, పరిశ్రమలలోని విలువైన వస్తువులు భద్రత కొరకు ఉపయోగపడే పరికరం తయారు చేసి ప్రదర్శన ఇచ్చారు. దొంగలించాలనే నెపంతో తలుపు తాళాలను బద్దలు కొట్టాలని ఎవరైన ప్రయత్నించిన వెంటనే సీక్రెట్‌గా ఉంచిన లేజర్ ఆలారం సిస్టమ్ యాక్టివేట్ అవుతుంది. దీంతో దొంగలను సులువుగా పట్టుకోవచ్చు. ఈ ప్రాజెక్టును తాడేపల్లిగూడెం జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థి ఎస్‌కే ఆలమస్ రూపొందించాడు. గైడ్ టీచర్ సీహెచ్ అనురాధ సూచనలు అందజేశారు.

గ్రూపు విభాగంలో రూపొందించిన ప్రాజెక్టులో భాగంగా వర్షాలు పడే సమయంలో ఎండబెట్టిన వరి ధాన్యం తడిసిపోకుండా ఉండేందుకు వీలుగా వరి ధాన్యం రక్షణ యంత్రంను తయారు చేశారు. ఆకస్మికంగా వర్షాలు పడితే ఈ యంత్రం ధాన్యంనకు రక్షణ కల్పిస్తుంది. ఆరుగొలను ఏపీఆర్ఎస్ డబ్యూ పాఠశాలకు చెందిన కె.హేమంత్, ఎస్.సుదీర్‌లు రూపొందించిన ప్రదర్శన ఆకట్టుకున్నాయి. పి.సురేష్ గైడ్‌టీచర్‌గా వ్యవహరించారు. ఈ ప్రాజెక్టు సైతం జిల్లా స్థాయికి ఎంపికైంది.

విద్యార్థులచే వివిధ ప్రాజెక్టులు తయారీ:

చెత్త చెదారాలతో విద్యుత్‌ను ఏ విధంగా ఉత్పత్తి చేయవచ్చు, వాటర్ ప్యూరీఫికేషన్, చంద్రయాన్ –3, ఆటోమెటిక్ ఫైర్ అలారమ్, స్మార్ట్ రోడ్లు, సోలార్ పవర్‌కారు, తదితర సైన్సు ప్రాజెక్టులను రూపొందించి భవిష్యత్తు ప్రదర్శనలకు వేదికగా మారారు.

సైన్స్ ప్రదర్శనల పట్ల ఆసక్తి కల్పిస్తున్నాం

విద్యార్థులల్లో సృజనాత్మకతను వెలికితీసే విధంగాను, లోతైన ఆలచనలు చేసే విధంగా వారిని ప్రోత్సహిస్తున్నాం. విద్యా వైజ్ఞానిక ప్రదర్శనలు ద్వారా విద్యార్థి స్థాయి నుంచి సాంకేతికతను అలవర్చుకోవచ్చు. ఉపాధ్యాయులు సైతం విద్యార్థులకు చక్కటి తోడ్పాటు ఇవ్వడంతో విద్యార్థులు సైతం నూతన ఆవిష్కరణలు చేసేందుకు ముందుకు వస్తున్నారు. విద్యార్థులను గుర్తించి వారిలో స్ఫూర్తి నింపితే భవిష్యత్తు తరాలలో శాస్త్రవేత్తలుగా రాణిస్తారు.

– ఎంఈఓ పీఎంకే జ్యోతి, ఎంఈఓ వి.హనుమ, తాడేపల్లిగూడెం

ఫీవర్ సర్వేలో పూర్తిస్థాయి సమాచారం నమోదు చేయాలి


తణుకులో ఆశ డే సమావేశంలో మాట్లాడుతున్న వెంకటేశ్వరరావు

తణుకు అర్బన్: ఫీవర్ కేసుల విషయంలో బాధితుల పూర్తి వివరాలు సేకరించేందుకు క్షేత్రస్థాయిలో హెల్త్ సిబ్బంది సమన్వయంతో పనిచేయాలని సబ్ యూనిట్ ఆఫీసర్ జి.వెంకటేశ్వరరావు అన్నారు. తణుకు బ్యాంక్ కాలనీలోని అర్బన్ హెల్త్ సెంటర్, రూరల్ పరిధిలోని వేల్పూరు, ఇరగవరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో మంగళవారం నిర్వహించిన ఆశ డే సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు. జ్వర బాధితులు గత 15 రోజులుగా ఎక్కడకు ప్రయాణాలు చేశారనే విషయం పూర్తి వివరాలు తీసుకోవాలని, ఏజెన్సీ ప్రాంతం, మలేరియా ప్రోన్ ఏరియాలకు వెళ్లి ఉంటే తక్షణమే ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు రిఫరల్ చేసి వైద్యసేవలందించాలని స్పష్టం చేశారు. మెడికల్ ఆఫీసర్స్ డాక్టర్ ఎస్.డానియల్ రాజు, డాక్టర్ కెఎంఆర్ కిషోర్, డాక్టర్ వీఎల్.క్రాంతి రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ ఎస్.ఉదయలక్ష్మి, హెల్త్ ఎక్స్‌టెన్షన్ హెల్త్ ఆఫీసర్ కె. సురేష్, సూపర్‌వైజర్స్ ఎ.శ్రీరామమూర్తి, బీవీవీకెడీఎస్ఎస్ఎన్ మూర్తి, ఆశా నోడల్ ఆఫీసర్స్ పి.సునీత, ఎం.దుర్గా కుమారి, పి.సువర్ణ, సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులు ప్రణాళికాబద్ధంగా చదవాలి


పైడిపర్రు ఉన్నత పాఠశాలలో సమావేశంలో మాట్లాడుతున్న హెచ్ఎం ఏడుకొండలు

తణుకు అర్బన్: విద్యార్థులు సమయాన్ని సద్వినియోగపరచుకుని ప్రణాళికాబద్ధంగా చదవాలని పైడిపర్రు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల హెచ్ఎం ఎం.ఏడుకొండలు అన్నారు. మంగళవారం పాఠశాలలో నిర్వహించిన 10వ తరగతి విద్యార్థుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పాఠశాలలో నూరు శాతం ఉత్తీర్ణత సాధించేలా ఉపాధ్యాయులు కృషి చేస్తున్నారని, తల్లిదండ్రుల సహకారం కూడా పూర్తిస్థాయిలో ఉంటే లక్ష్యాన్ని చేధించగలమని స్పష్టం చేశారు. ఇకపై ఇంటివద్ద తమ పిల్లలు పూర్తిగా చదివేందుకే సమయం కేటాయించేలా తల్లిదండ్రులు గమనిస్తూ ఉండాలని సూచించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు మూర్తి, రామలక్ష్మి ఏసుకృప, రామకృష్ణ జయరాజు, స్వరూపరాణి, విజయకుమారి, ప్రసాద్, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

సూపర్ డీలక్స్ కొత్త బస్సు ప్రారంభం


సూపర్ డీలక్స్ కొత్త బస్సు ప్రారంభిస్తున్న దృశ్యం

తాడేపల్లిగూడెం (టీఓసీ): తాడేపల్లిగూడెం నుంచి విశాఖపట్నం సూపర్ డీలక్స్ కొత్త బస్సును మంగళవారం ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్, ఆర్టీసీ విజయవాడ జోనల్ చైర్మన్ రెడ్డి అప్పలనాయుడు చేతుల మీదుగా ప్రారంభించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ విదేశాలలో లేని ఆర్టీసీ సంస్థ మనకు ఉందన్నారు. దాన్ని బతికించుకోవాలని తెలిపారు. ఆర్టీసీ డీఎం ఏలూరు సత్యనారాయణమూర్తి పాల్గొన్నారు. అనంతరం జోనల్ చైర్మన్ బస్సు కాంప్లెక్స్, డీపోలను తనిఖీలు చేశారు. పార్శిల్, కొరియర్ రవాణా కార్యాలయాన్ని పరిశీలించారు. బస్టాండ్ ఆవరణలో మొక్కలు నాటారు. బస్టాండ్‌లో ఉన్న సైకిల్ స్టాండ్, వివిధ స్టాల్స్‌ను పరిశీలించారు. ప్రయాణికులకు అందజేస్తున్న సేవలను గురించి అడిగి తెలుసుకున్నారు. ప్రయాణికులకు ఎల్లప్పు డు పరిశుభ్రమైన మంచినీరు అందజేయాలని, మరుగుదొడ్లు మరింత పరిశుభ్రంగా ఉంచాలని పలు సూచనలు చేశారు. అసిస్టెంట్ మేనేజర్ సుధారాణి, వివిధ యూనియన్ నాయకులు, సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులకు స్టడీ మెటీరియల్ పంపిణీ


కొమ్మర జెడ్పీ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు స్టడీ మెటీరియల్‌ను అందజేస్తున్న ఎంఈఓలు

అత్తిలి: పది పరీక్షలకు ఇప్పటి నుంచే సన్నద్ధం కావాలని మండల విద్యాశాఖాధికారులు ఎన్ రమేష్, ఎంపీఎల్‌కే ప్రసాద్ తెలిపారు. రాష్ట్రోపాధ్యాయ సంఘం రూపొందించిన ఎస్ఎస్‌సీ స్టడీ మెటీరియల్‌ను మంగళవారం అత్తిలి మండలం కొమ్మర జెడ్పీ ఉన్నత పాఠశాలలో మేథ్స్ స్కూల్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న ఎంవీ సుబ్బరాజు సౌజన్యంతో విద్యార్థులకు ఉచితంగా అందజేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో ఎంఈవోలు మాట్లాడుతూ విద్యార్థులు రెగ్యులర్ పాఠ్యాంశాలతో పాటు స్టడీ మెటీరియల్‌ను చదివి మంచి ఉత్తీర్ణత సాధించాలన్నారు. సబ్జెక్టులలో ఏమైనా సందేహాలు ఉంటే ఉపాధ్యాయులను అడిగి తెలుసుకోవాలన్నారు. దాత ఎంవీ సుబ్బరాజును పాఠశాల తరపున అభినందించారు. పాఠశాల ఇన్‌చార్జ్ ప్రధానోపాధ్యాయుడు జె నాగేశ్వరరావు గ్రామ ప్రముఖులు ముదునూరి బాలకృష్ణంరాజు, ఎస్టీయూ మండల శాఖ అధ్యక్షుడు ఎ సూర్యనారాయణ, ప్రధాన కార్యదర్శి జెఎస్ఎన్ ప్రసాద్, రాష్ట్ర నాయకులు డీఎంజీ ప్రసాద్, యూఎస్‌వీ శివయ్య, కె నారాయణ, సీహెచ్ పుష్పలత పాల్గొన్నారు.

9న ప్లేస్‌మెంట్ డ్రైవ్

పెంటపాడు: మండలంలోని పెంటపాడు డీఆర్ గోయంకా ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఏపీ నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ప్లేస్‌మెంట్ డ్రైవ్ సెలక్షన్‌లు నిర్వహించనున్నట్లు నైపుణ్యాభివృద్ధి అధికారి పి. లోకమన్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సెలక్షన్‌లో టీంలీజ్, ముత్తూట్ ఫైనాన్స్ కంపెనీలలో ఉద్యోగ అవకాశాలు కల్పించడం జరుగుతుందన్నారు. నిరుద్యోగులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

కోడిపందేలు నిర్వహిస్తే ఉపేక్షించేది లేదు

తాడేపల్లిగూడెం రూరల్: కోడిపందేలు, గుండాటలు నిర్వహిస్తే ఉపేక్షించేది లేదని రూరల్ ఎస్సై జేవీఎన్. ప్రసాద్ హెచ్చరించారు. మంగళవారం మండలంలోని వెంకట్రామన్నగూడెం గ్రామంలో కోడిపందేల నిరోధక చట్టంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆయన వెంట ఏఎస్సై పీవీకే.దుర్గారావు, సిబ్బంది ఉన్నారు.

పాస్‌పోర్ట్ పడి పోయినది


[illegible] నెం.N8887793 [illegible]
దొరికిన వారు సెల్ నెం. : 81063 53419 కు తెలియజేయగలరు.

రబీసాగులో ఈ–పంట నమోదు చేయాలి


పాలిలో ఈ- పంట నమోదును పరిశీలిస్తున్న వ్యవసాయశాఖ అధికారి వెంకటేశ్వరరావు

అత్తిలి: వ్యవసాయశాఖ సిబ్బంది తమకు నిర్దేశించిన లక్ష్యాలను సాధించి రైతులకు అన్ని పథకాలు అందేవిధంగా చర్యలు తీసుకోవాలని జిల్లా వ్యవసాయశాఖ అధికారి జెడ్ వెంకటేశ్వరరావు అన్నారు. మంగళవారం అత్తిలిలో గ్రామ వ్యవసాయ సహాయకులతో వ్యవసాయశాఖ అధికారి కార్యాలయంలో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ రబీనాట్లు మొదలైనందున రబీ ఈ పంట వెంటనే చేయించాలని అన్నారు. అనంతరం పాలి గ్రామంలో ఈపంట నమోదుపై క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయశాఖ అధికారి టీకే రాజేష్, వ్యవసాయశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

బెల్ట్‌షాపు నిర్వాహకుడి అరెస్టు


బెల్ట్‌షాపు నిర్వాహకుడిని అదుపులోకి తీసుకున్న ఎక్సైజ్ అధికారులు

తాడేపల్లిగూడెం రూరల్: బెల్ట్‌షాపు నిర్వహిస్తున్న నేరంపై ఒక వ్యక్తిని అదుపులోకి తీసుకున్నట్లు ప్రొహిబిషన్, ఎక్సైజ్ సీఐ ఇ.స్వరాజ్యలక్ష్మి తెలిపారు. మంగళవారం ఆమె తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని కొమ్ముగూడెం గ్రామంలో తనిఖీలు చేయగా, స్థానికంగా బెల్ట్‌షాపు నిర్వహిస్తున్న ఒక వ్యక్తిని అదుపులోకి తీసుకున్నారు. అతని వద్ద నుంచి ఆరు డ్యూటీ పెయిడ్ మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నట్లు వివరించారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ స్వరాజ్యలక్ష్మి తెలిపారు.

సమస్యలపై దృష్టి సారించాలి

తాడేపల్లిగూడెం: పురపాలక సంఘాల పరిధిలోని పలు సమస్యలను పరిష్కరించేందుకు కమిషనర్లు దృష్టి సారించాలని రీజినల్ డైరక్టర్ సీహెచ్ నాగ నరసింహారావు పేర్కొన్నారు. స్థానిక బలుసులమ్మ కల్యాణ మండపంలో మంగళవారం జిల్లాలోని పురపాలక సంఘాల కమిషనర్లతో సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. నాగ నరసింహారావు మాట్లాడుతూ ప్రతి రోజు క్షేత్రస్థాయిలో వార్డులను సందర్శించాలని, పారిశుద్ధ్య నిర్వహణపై దృష్టిసారించాలని చెప్పారు. పట్టణంలోని అంతర్గత రహదారుల అభివృద్ధికి చర్యలు తీసుకోవాలని పలు సూచనలు చేశారు. ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ హాజరై మాట్లాడారు. ఈ కార్యక్రమంలో గూడెం కమిషనర్ ఏసుబాబు పాల్గొన్నారు.